వెలమ సమాచార్
VELAMASAMACHAR
శ్రీ వెలమ విజయం
సమైక్య వెలమల సర్వ సమాచార వేదిక Visit: www.velamasamachar.com / Call : 9246670571, 92980 52443
BG Naidu





# వెలమ జాతికి వాసి తెచ్చిన

# వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు

**ఆగస్టు-16**

**జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం**

వాసిరెడ్డి అనేపేరు ఆంధ్రరాష్ట్రంలో ఎవరైనా పలికితే వెంటనే గుర్తుకు వచ్చేది, గుర్తుకు తెచ్చేది వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు వారి కీర్తి.

ఆంధ్ర రాష్ట్రంలో నాటికి నేటికి ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న పట్టణం బొబ్బిలి. ఈ పేరు వినగానే గుర్తుకు వచ్చేది గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా ఎంతో నైతిక విలువలతో బ్రతికి పోరాటం సాగించిన ఆనాటి వెలమ వీరులే గుర్తుకు వస్తారు. ప్రాణాలు కన్నా మానాలు మిన్న అని తలచిన వెలమ పతివ్రతా వీరవనితలే మనకు స్ఫురణకు వస్తారు. వందల సంవత్సరాల నుండి ఈ ప్రాంతం ఈ రాష్ట్రానికి, దేశానికి ఎంతోమంది మహానాయకులను, విద్యావేత్తలను, జడ్జిలను, చీఫ్ ఇంజనీర్లను, ఐపీఎస్‌లను, ప్రముఖ డాక్టర్లను అందిస్తున్నది.

అలాంటి ఈ పట్టణం (బొబ్బిలి)కి 12 కిమీ దూరంలో పినపెంకి గ్రామం వుంది. ఈ గ్రామం పేరు ఇంచుమించుగా ఆంధ్రరాష్ట్రం వెలమలందరికీ సుపరిచితమే. కారణం ఈ గ్రామంలో 16-8-1922లో వాసిరెడ్డి పెద అప్పలనాయుడు దంపతులకు పుట్టిన వెలమ రాజకీయ యోధుడే కీ॥శే॥ వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు గారు. ఒకనాటి వెలమ జాతి ఆశాజ్యోతి. వీరి తండ్రిగారు ఆనాడు ఆ ఊరికి మునసబుగా పని చేసేవారు ఆనాడే తండ్రి నుండి వీరు రాజకీయ లక్షణాలు పుణికిపుచ్చుకున్నారు. వీరు 10వ తరగతి వరకు బొబ్బిలిలో చదివి ఆ తరువాత మద్రాస్ ఇంజనీరింగ్

VELAMASAMACHAR

P.T.O.

కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ చేశారు. అనంతరం కొన్నాళ్లు సివిల్ కాంట్రాక్ట్స్ చేసి ఆ తరువాత 1957లో సోషలిస్టు పార్టీ తరపున నాటి రాష్ట్రపతి వివి గిరి మీద పార్వతీపురం పార్లమెంటరీ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 1962లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా బలిజిపేట నుండి పోటీ చేసి గెలుపొందారు. 1963లో శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్‌గా పని చేశారు. చైర్మెన్ కూర్మన్న గారి మరణంతో ఈయన చైర్మెన్ అయి 1965 వరకు కొనసాగారు. రెండు పదవులు వుండకూడదనే నైతిక సిద్ధాంతంలో చైర్మెన్ పదవికి రాజీనామా చేశారు. 1967లో కాంగ్రెస్ తరపున పెదమానాపురం నుండి పోటీ చేశారు. 1968లో విజయనగరం జిల్లా నుండి ఎమ్మెల్సీగా వుంటూ, 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి గారి మంత్రివర్గంలో విద్యుత్ శాఖా మంత్రిగా, తరువాత ఎక్సైజ్ మంత్రిగా చేశారు.

1971లో పీవీ నరసింహారావు మంత్రివర్గంలో రాష్ట్రం హోం శాఖా మంత్రిగా చేసి, 1973లో జై ఆంధ్రా యాజిటేషన్ జరిగిన సమయంలో వీరు రాజీనామా చేసి మరలా 1974 నుంచి 1977 వరకు జలగం వెంగలరావు మంత్రివర్గంలో ఇరిగేషన్ మంత్రిగా చేశారు. 1978లో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసి తదనంతరం 1980 వరకు ఎమ్మెల్సీగా కొనసాగారు.

వీరు వెలమ కులస్థులకు మంత్రిగా వున్న సమయంలో ఎన్నో ఉద్యోగాలు వేయించి, జాతికి ఓ దారి చూపారు. నాటి కాలంలో ఉద్యోగాలు పొందిన వారిలో చాలామంది ఈరోజు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా, చీఫ్ ఇంజనీర్లుగా పనిచేస్తూ సమాజానికి అత్యున్నత సేవలందిస్తున్నారు. వీరి హయాంలో నిర్మించిన వెంగళరాయసాగర్, మడ్డువలస, వంశధార, పెదంకిలం, రిజర్వాయర్‌లు ఈరోజు ఎన్నో వేల ఎకరాలకు సాగునీటిని, తాగునీటిని అందిస్తూ ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. వీరు 1969 నుండి 1977 వరకు మంత్రిగా కొనసాగి ఆంధ్ర రాష్ట్రానికి అత్యుత్తమ సేవలు అందించారనడంలో అతిశయోక్తి లేదు.

ఆయన రిజర్వాయర్ల నిర్మాణంలో తన ప్రతిభా పాటవాలను ఉపయోగించి తన అంకితభావాన్ని ప్రదర్శించారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆయన చేపట్టిన మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆయనకు విశేషమైన ప్రజాభిమానాన్ని సంపాదించి పెట్టాయి. అలాగే మంత్రి పదవులు చేపట్టకముందు ఆయన శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మెన్ పదవి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారు. బొబ్బిలి నియోజకవర్గంలో విస్తృతంగా రోడ్ల నిర్మాణం, భవన నిర్మాణం చేపట్టారు. జెడ్పీ చైర్మెన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు చేసిన ప్రజాసేవ, అభివృద్ధి

P.T.O.

కార్యక్రమాలకు గుర్తుగా బొబ్బిలిలో ఆయన కాంస్య విగ్రహం ప్రతిష్టించి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆ తర్వాత కృష్ణమూర్తి గారి తనయుడు వాసిరెడ్డి వరదరామారావు రాజకీయ వారసుడిగా వచ్చి రెండుసార్లు తెర్లాం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తండ్రీ తనయులు ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ నుంచే ప్రాతినిధ్యం వహించారు. కులం కూడు పెట్టదు, ప్రపంచమంతా ఒక కుగ్రామం అయిపోతున్న నేటి ఆధునిక కాలంలో ఇంకా కులం, మతం ఏమిటి? అంటూ చాలామంది గొప్పగా డైలాగులు వినిపిస్తుంటారు. కానీ కులం అనేది ఒక జాతి సాంప్రదాయ సామూహిక జీవన విధానాన్ని, కట్టుబాట్లను ప్రతిబింబించే వ్యవస్థ. కుల సంఘాలు పెట్టుకునేది సమాజంలో వేరే కులాన్ని తిట్టడానికో, చిన్నచూపు చూడడానికో కాదు. ఆటవిక దశ నుంచి మానవుడి జీవన విధానంలో సహజసిద్ధమైన పరిణామాలు చోటుచేసుకుంటూ వస్తున్నాయి. ఆ పరిణామ క్రమంలోనే మానసిక ఆలోచనా ధోరణులు, వ్యవహారశైలి ఒక్కటే అయిన వ్యక్తులు కులం అనే తమ సొంత వర్గ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కులాన్ని అభ్యుదయం కోసం, చైతన్యం కోసం ఉపయోగించుకుంటూ అటు సమాజ పురోభివృద్ధికి ఆర్థికంగా, మేధాశక్తిపరంగా తోడ్పాటును అందించాలని ఆకాంక్షించే ఆదర్శ వ్యక్తులు కొందరు వుంటారు. వారు తమకు వీలైతే ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి పది మందికి సేవ చేయాలనే లక్ష్యం పెట్టుకుంటారు. అందుకు తీవ్రంగా తమ వంతు కృషి చేస్తారు. అటువంటి గొప్ప మనస్తత్వం గల వ్యక్తుల్లో మన వెలమ కుల పెద్దలు కీర్తిశేషులు వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు గారు ఒకరు. హైదరాబాదు ఎల్‌బి నగర్‌లోని ఆనాటి సిదార్థ కల్చరల్ అసోసియేషన్ (వెలమ సంఘం) వ్యవస్థాపకుడిలో నాయుడు గారు ఒకరు. సంఘం భవన నిర్మాణానికి స్థలం కొనుగోలు చేసి, విరాళాల ద్వారా భవనాన్ని నిర్మించి మనకు అందించిన మరపురాని ఆదర్శ వ్యక్తి కృష్ణమూర్తినాయుడు గారు. అందుకే ఆయన మన వెలమ కుల సంక్షేమానికి, ప్రజాప్రతినిధిగా, మంత్రిగా రాష్ట్ర ప్రజలకు అందించిన అభివృద్ధి సేవలను నేటితరానికి మరోమారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని తలచి వారి జీవన యాత్రా గమనాన్ని మాకు చేతనైనంతలో సేకరించి మీకు అందిస్తున్నందుకు ఆనందిస్తున్నాం.

– ఎడిటర్



వెలమ వివాహ వేదిక
27 సంవత్సరాల అనుభవంతో వేలాది వివాహాలు కుదిర్చిన అగ్రగామి వెలమ వివాహ సమాచార వేదిక
(విశాఖ మ్యారేజ్ లైన్స్)
సీతంపేట, విశాఖపట్నం - 16, వెంగళరావునగర్, హైదరాబాద్ - 38
Vizag 0891-2597347, 9246670571
9298052443, 8341376011
Hyd - 040-40156976, 9848190571
9951762380, 9246674571
Visit: Website or App. velamamatrimony.net
E-mai: velamamatrimony9@gmail.com,